

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రరం రూరల్ : 2023-24 విద్యాసంవత్సరానికి జిల్లాలో గల ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జివి.రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రములతో iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 6లోగా దరఖాస్తుల చేసుకోవచ్చున్నారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలలో అడ్మిషన్స్‌కు సంబంధించి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, కౌన్సిలింగ్ తేదీలు త్వరలో తెలియజేస్తామన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించొచ్చున్నారు.

పసిడి పరుగు

నాలుగేళ్లలో బంగారం ధర రెట్టింపు

2019లో గ్రాము రూ.3,200. నేడు రూ.6,200

కార్పొరేట్ సంస్థల రాకతో స్థానిక షాపులు వెలవెల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బంగారం ధరలు రోజు రోజుకీ ఆకాశాన్నంటుతున్నాయి. గడిచిన పదేళ్లలో గ్రాముకు రూ.3280 వరకూ పెరిగింది. వెండి ధరలు సైతం పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర నాలుగేళ్లలో రెట్టింపైంది. కోవిడ్ కారణంగా అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. కఆని బంగారం మాత్రం దూసుకుపోయింది.

వ్యాపారం ఆశాజనకంగా లేదు

బంగారు ఆభరణాలు తయరీ, విక్రయం రంగంలో మూడు దశాబ్ధాలుగా పని చేస్తున్నాను. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో విరివిగా ఆర్డర్లు వచ్చేవి. మా కుటుంబంతో పాటు మరో ఐదుగురు మా షాపులోఉపాధి పొందేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. కార్పొరేట్ సంస్థలు గడిచిన ఐదేళ్లలో 5కు పైగా భారీ షాపులు ఏర్పాటు చేశాయి. దీంతో స్థానిక వ్యాపారాలు పడిపోయాయి. పండుగలకు, పెళ్లిళ్లకు బంగారం కొనుగోలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. గతంలో తయారీ చేయించే వారు సైతం ప్రస్తుతం రెడీమెడ్ కొనుగోలు చేయటంతో ఉపాధి కొరవడింది.

- కె.భాస్కరాచారి, మెయిన్ రోడ్డు

తాజాగా పది గ్రాముల బిస్కట్ బంగారం రూ.62 వేలకు చేరింది. ధర ఇదే విధంగా పెరిగితే త్వరలో రూ.70 వేలకు చేరే అవకాశం ఉందని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ధరల పెరుగుదల, మరో వైపు కార్పొరేట్ సంస్థలు రాకతో స్థానిక వ్యాపారాలు పూర్తిగా వెల వెల బోతున్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.

బంగారం ధర రోజు రోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వెలవెలబోతోంది. గడిచిన వారంలో పసిడి ధర గ్రాముకు రూ.200పైనే పెరిగింది. గత నెలలో చాలాకాలం గ్రాము బంగారం రూ.5400 నుంచి రూ.5900 మధ్యనే ఉంది. అంతర్జా తీయంగా నెలకొన్న పరిస్థితుల ప్రభావం బులియన్ మార్కెట్‌పై చూపింది. దీంతో ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడంతో ధర ఆకాశాన్ని అంటింది. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో అత్యధికంగా బంగారం దుకాణాలు ఉన్నాయి. అత్యధిక వ్యాపారం రాజమండ్రిలో జరుగుతోంది. మెయిన్ రోడ్డు, గోకవరం బస్టాండ్, ఎవి అప్పారావు రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు, ఇతర చిన్న షాపులు కలిపి 200పైగా ఉన్నాయి. ప్రస్తుతం ధర పెరగటంతో వినియోగదారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గు తుందన్న ఆశతో అవసరం ఉన్నా ఆ స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. దీంతో జ్యూయలరీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్టు వెండి కూడా దూసుకుపోతోంది. గత నెలలో కేజీ రూ.68 వేల మధ్య చాలాకాలం నిలకడగా ఉన్న ధర పసిడితో పోటీ పడుతోంది. అయితే కేజీ వెండి



రూ.73 వేలకు చేరింది.

కొరవడిన సందడి

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపధ్యంలో కళ కళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓ వైపు ధరలు పెరగటం మరో వైపు, కార్పొరేట్ సంస్థలు రాక ప్రధాన కారణమని జ్యూయలరీ షాపుల యజమానులు చెబుతున్నారు. 2013లో రూ.2,920 ధర ఉండేది. 2021లో రూ.4,800, 2022 రూ.5,300, 2023లో రూ.6,200 చేరింది. గడిచిన పదేళ్లలో అక్షరాలా రూ.3280 ధర పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 10 వేలకు పైగా కార్మికులు ఆభరణాల తయారీ రంగంలో ఉపాధి పొందేవారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావటం, ధరలు పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమెడ్ వ్యాపారం ప్రారంభించటంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలి వెళ్లినట్లు జ్యూయలరీ వర్కర్స్ చెబుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇతర జిల్లాల నుంచి సైతం గతంలో రాజమహేంద్రవరం వచ్చే వారని ప్రస్తుతం స్థానికులు సైతం రెడీమెడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది.

రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గర్భిణులు, బాలిం తలు, కిశోర బాలికలు, చిన్నారుల్లో రక్త హీనత నివారణకు అంగన్‌వాడీలు, ఆశాలకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహం`రెడ్డి వెలగపూడి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్‌భరత్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ జిల్లాలో తీసుకున్న చర్యను వివరించారు. గర్భిణుల ఆధార్ అప్‌డేషన్ పూర్తయిందన్నారు. జిల్లాలో 2,255 మంది గర్భిణులకు మేనెలలో వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వీరిరందరికీ హిమోగ్లోబిన్ శాతం పెంచేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. గర్భిణుల వివరాలు 70 శాతం నవీకరించామన్నారు. జిల్లాలో పాఠశాలలకు 274 అదనపు తరగతి గదులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయన్నారు. స్కూల్స్ ప్రారంభం నాటికి మరమ్మతులు, పెండింగ్ పనులుపై సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జెవికె కిట్ల స్టాక్ పాయింట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయిస్తున్నామన్నారు. అలాగే స్పందనలో ఈ వారం 206 అర్జీలను పరిష్కరించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్ డబ్ల్యుఎస్ అధికారి డి.బాలశంకరరావు, పిఆర్ఎస్ ఎవిబి.ప్రసాద్, డిఎల్‌డిఒ శాంతకుమారి, డిఇఒ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మూడో సోమవారం 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతి నెలా మూడో సోమవారం ఎస్‌పి, కలెక్టర్ ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం' పేర స్పందనను నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణిలతో కలిసి ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జెకెసి వల్ల అధికారుల్లో మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. 'జగనన్నకి చెబుదాం'ద్వారా 1902 టోల్ ఫ్రీ నెంబర్ తీసుకొచ్చారన్నారు. 1902కి ఫోన్ చేయడం ద్వారా నేరుగా ఫిర్యాదు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుతుందన్నారు. ఇలాంటి అర్జీలకు వైఎస్ఆర్(యువర్ సర్వీస్ రిక్వెస్ట్) నంబర్ ఇస్తారన్నారు. జెకెసి నిరంతర పర్యవేక్షణ కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్, జిల్లా స్థాయిలో ఆడిటింగ్ యూనిట్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

రెండు మిల్లులపై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో తేమ, తాలు సాకుగా చూపించి రైతుల నుంచి నగదు వసూలు చేస్తున్న రెండు రైస్ మిల్లులపై కలెక్టర్ మాధవీలత చర్యలు చేపట్టారు. ఈ నెల 10న ప్రజాశక్తి మెయిన్‌లో 'క్వింటాకు ఆరు కిలోల తరుగు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. మరోవైపు రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం, ధారవరంలో రెండు రైసు మిల్లులను ఉన్నతాధికారులతో తనిఖీలు చేయించారు. యాజమాన్యం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ధాన్యం సేకరణ చేసే ప్రక్రియ నుంచి వాటిని తొలగించారు. ఈ మేరకు కలెక్టర్ కె. మాధవీలత, జెసి ఎన్.తేజ్‌భరత్ గురువారం ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. ధాన్యం సేకరణలో రైతుల నుంచి మిల్లర్లు ఎవ్వరూ డబ్బులు వసూలు చేయరాదన్నారు. అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని



క్వింటాకు ఆరు కిలోలు తరుగు

- తేమ, తాలుతో పేరుతో దగా
- దండుకుంటున్న రైస్‌మిల్లర్లు

ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం

హెచ్చరించారు. బ్రాహ్మణ గూడెంలో సూర్య దత్త ట్రేడర్స్, ధారవరంలో శ్రీతేజా ఏజెన్సీస్‌లో డబుబ్లఉ వసూలు చేసినట్టు రుజువు కావడంతో వాటిని కస్టమైజ్డ్ మిల్లింగ్ రైస్‌సేకరణ పక్రియ నుంచి తొలగించామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం

ప్రజాశక్తి - బిక్కవోలు

షార్ట్ సర్క్యూట్ కారణంగా బలబద్రపురంలో మాలపల్లి తూము వద్ద టీ కొట్టు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అనపర్తి ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఒ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉదయం 8:30 గంటల సమయంలో పిండి రుబ్బుతున్న గ్రైండర్ నుంచి మంటలు రావడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. సుమారు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం ఉంటుందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

బెయిల్‌పై ఆదిరెడ్డి అప్పారావు, వాసు విడుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



గజమాలలతో స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

చిట్‌ఫండ్ కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి నాయకులు వాసు బెయిల్‌పై గురువారం విడుదలయ్యారు. నిందితుల తరుపు న్యాయవాది అభ్యర్థన మేరకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను బుధవారం మంజూరు చేసింది. సెంట్రల్ జైలు అధికారులకు ఆ పత్రాలు ఆలస్యంగా రావటంతో గురువారం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు గజమాలలతో ఇరువురినీ స్వాగతించారు. సెంట్రల్ జైలు నుంచి ర్యాలీగా వారు ఇంటికి చేరకున్నారు. ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని హారతితో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడారు. రాజకీయంగా బలంగా ఉన్న కుటుంబాలపై ముఖ్యమంత్రి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆదిరెడ్డి అప్పారావు, వాసు అరెస్టే దీనికి నిదర్శనమన్నారు. రాజకీయంగా తమను ఎదుర్కొనే శక్తి లేకనే ఇలాంటి చర్యలకు దిగుతున్నారన్నారు. ప్రభుత్వ వేధింపులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు.

సత్యవతి నేత్రాలు దానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన సీర్ల సత్యవతి(80) నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. సత్యవతి గురవారం మృతి చెందారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆమె కార్నియాలను సేకరించారు. ఆమె కుమారుడు బ్రహ్మానందం వైసిపి నాయకునిగా ఉన్నారు. రాజమహేంద్రవరం ఆటో కన్సల్టెన్సీ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సత్యవతి మతికి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నీలి నాగబాబు, సిబ్బంది, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అల్పాహారాన్ని అందించారు. విద్యార్థులు ఎవరూ కూడా అర్థాకలితో ఉండకూడదనేది తన ఆశయమని, అందుకే అల్పాహారాన్ని అందజేస్తున్నామని మండల మానవతా శాఖ డైరెక్టర్ గోకవరపు బాబులు తెలిపారు. మానవతా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పది రోజులపాటు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడానికి ముందుకొచ్చిన డైరెక్టర్ బాబులు ఉదారత అభినందనీయ మన్నారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా తదితర అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, ఇసి మెంబర్ సనపల రాజశేఖర్, సభ్యులు కె.ప్రసన్నకుమార్, హెచ్ఎం జెవి.ప్రమోద్ కుమార్, గ్రంథ పాలకుడు నరేష్ పాల్గొన్నారు.



సిఎం గారి ప్రోగ్రామ్ అయిపోయాక... మంత్రి గారి మొక్కలు నాటే కార్యక్రమం ఉందయ్యా!!!

మహానాడుతో ఎన్నికల శంఖారావం

ప్రజాశక్తితో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



జిల్లాలో నిర్వహించబోయే మహానాడుతో తమ పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించనున్నారని టిడిపి సీనియర్ నాయకులు, పొలిట్ బ్యూరో సభ్యులు, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. మహానాడు సందర్భంగా జిల్లాలోని సీనియర్ నాయకుల్లో ఒకరైన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రజాశక్తి పలుకరించింది. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిలోనూ సంక్షేమ ఫలాలను అందించడంలోనూ ఘోరంగా విఫలమైందన్నారు. అన్ని రంగాల్లో ప్రజల నుంచి తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జరగబోయే మహానాడుకు ప్రత్యేకత ఏర్పడిందన్నారు. దీనికి లక్షలాదిమంది ప్రజలు, టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరులు తరలి రానున్నారని తెలిపారు.

జిల్లాలో మహానాడు సంసిద్ధత ఎలా ఉంది . ఎంత మంది హాజరయ్యే అవకాశం ఉంది.?

మహానాడు ఈనెల 27, 28 తేదీల్లో జరగనుంది. రాజమహేంద్రవరం రూరల్ వేమగిరి మహానాడుకు వేదిక కానుంది. తొలిరోజు ప్రతినిధుల సభ రెండో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నాం. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలకు ఈ మహానాడును అంకితం చేస్తున్నాం. ఉభయగోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రం నుంచి, విదేశాల నుంచి కూడా టిడిపి ప్రతినిధులు కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరానున్నారు. ఇందులో భాగంగా 12న భూమి పూజ చేసి పూజా కార్యక్రమంతో మహానాడు పనులు ప్రారంభం కానున్నాయి. సుమారు పది లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నాం. ఎంతమంది వచ్చినా రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నాం.

మహానాడు నిర్వహణకు అనుమతులు, తదితరాలపై సర్కారు నుంచి సమస్యలున్నాయా?

ప్రతిపక్ష పార్టీ కార్యక్రమాలకు వైసిపి ప్రభుత్వం అనేక ఆటంకాలు సృష్టిస్తోంది. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్రకు అనేక అడ్డంకులు కలిగించిన విషయం అందరికీ తెలిసిందే. ప్రజాభిమానం ముందు నిర్బంధాలు, అడ్డంకులు వీగిపోతాయి. యువగళం పాదయాత్రకు విశేష ప్రజాధారణ లభిస్తోంది. మహానాడు నిర్వహించేందుకు అనుమతులు కోరుతాం. ప్రభుత్వం ఆటంకాలు కల్పించినా మహానాడును విజయవంతం చేసి తీరుతాం. 1993లో నిర్వహించిన మహానాడుకు నందమూరి తారక రామారావు హాజరయ్యారు. ఆ సభకు లక్షలాది మంది తరలివచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలన విముక్తి కావాలని అన్ని పక్షాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సభకు లక్షలాది మంది తరలి వస్తారని భావిస్తున్నాం.

జిల్లాలో ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహణకు కారణం ఏమైనా ఉందా? ఈ కార్యక్రమంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చే అవకాశాలున్నాయా...

టిడిపిని స్థాపించినప్పటి నుంచి గోదావరి జిల్లాల్లో పార్టీకి విశేష ప్రజాధరణ ఉంది. 1982లో క్లీన్ స్వీప్ చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీ సొంతం. బలమైన నాయకత్వంతో పాటు పార్టీకి లక్షలాదిమంది కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు ఈ ప్రాంతంలో ఉన్నారు. ఈ ప్రాంతంలో మహానాడును నిర్వహించడం సెంటిమెంట్‌గా కూడా భావిస్తున్నాము. దీంతో టిడిపికి పూర్వ వైభవం రానుంది అని కచ్చితంగా చెప్పగలను.

రాష్ట్ర రాజకీయాలకు తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉంది. ఈ మహానాడు వేదికపై నుంచి శంఖారావం పూరించనున్నారా?

రాష్ట్ర రాజకీయాలకు తూర్పుగోదావరి జిల్లా కేంద్రం అని చెప్పడం వాస్తవమే. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు ఇక్కడి నుంచే శంఖారావం పూరించి రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించారు. అదే స్ఫూర్తితో ఈ నెలలో జరగబోయే మహానాడు వేదిక నుంచే పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం రీజనల్‌గా మహానాడులు నిర్వహించి ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టనున్నాము.

నాయకుల్లో సమన్వయం లోపాలున్నాయనే ప్రత్యర్థుల విమర్శలపై ఏమంటారు..?

ఏ రాజకీయ పార్టీలో అయినా సాధారణంగా అభిప్రాయ భేదాలు ఉండడం సహజం. అందరినీ కలుపుకుని వెళ్తాం. ప్రజా సమస్యలపై స్పందించి నిరంతరం ప్రజల కోసం టిడిపి నాయకులు, కార్యకర్తలు పనిచేస్తుంటారు. అటువంటి యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఉంటుంది. రాబోయే రోజుల్లో విమర్శలన్నీ పటాపంచలవుతాయి.

టిడిపి అధినేత పలు కార్యక్రమాలను జిల్లా నుంచే ప్రారంభించారు. ఆయన పర్యటనలు కేడర్‌లో నూతనోత్సాహాన్ని ఇచ్చాయని అనుకోవచ్చా...

తప్పకుండా... టిడిపి అధినేత చంద్రబాబు పిలుపుతో గతంలో చేపట్టిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి విశేష ప్రజాధరణ లభించింది. తాజాగా 'మా పంట మునిగింది పరిహారం ఇవ్వండి' అనే పేరుతో దశలవారీ పోరుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి బ్రహ్మాండమైన స్పందన ఉంది. రాష్ట్రంలో 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అకాల వర్షాల కారణంగా రైతులు పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వం కేవలం 36 లక్షల టన్నులు మాత్రమే కొంటానంటోంది. మిగిలిన దాన్ని రైతులు ఎలా అమ్ముకోవాలి? రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అలాగే పన్నులు, అధిక ధరలు వంటి ఇబ్బందులతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆక్రోసంతో ఉన్న అన్ని రంగాల ప్రజలు చంద్రబాబు కోసం వేచి చూస్తున్నారు. ఎక్కడికి వెళ్ళినా బ్రహ్మరథం పడుతున్నారు. ఆయన పర్యటనలతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చింది.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న కుందుల

ప్రజాశక్తి-పెరవలి

వెంకట్రాయపురంలోని అభయ ఆంజనేయస్వామిని టిడిపి నియోజకవర్గ నాయకులు కుందుల వీరవెంకటసత్యనారాయణ గురువారం దర్శించుకున్నారు. ఆలయం పునరుద్దరణ ఉత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నూక, తేమ శాతాన్ని నిర్ధారించుకోవాలి

పెరవలి : పంటను ఆర్‌బికెలకు తీసుకెళ్లి నూక, తేమ శాతాన్ని నిర్ధారించుకోవాలని తహశీల్దార్ టి.రాజేశ్వరి రైతులకు సూచించారు. వీటి నిర్ధారణ తరువాతే ధాన్యాన్ని మిల్లులకు పంపుతారన్నారు. తద్వారా రైతులు ధాన్యానికి సొమ్ము వసూలు సమస్య ఉండదన్నారు. రైతులందరూ తప్పకుండా నూక, తేమ శాతాలను నిర్ధారించుకోవాలన్నారు.

హోం మంత్రిని కలిసిన ఈస్ట్‌జోన్ డిఎస్‌పి

కొవ్వూరు రూరల్ : రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డిఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్‌బాబు హోం మంత్రి డాక్టర్ తానేటి వనితను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డిఎస్‌పిల బదిలీల్లో భాగంగా మార్కాపురం నుంచి ఆయన రాజమహేంద్రవరానికి వచ్చారు. ఆయన వెంట బొమ్మూరు సిఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

రైతులకు పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి- నల్లజర్ల , గోపాలపురం

ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కలెక్టర్ కె.మాధవీలతకు టిడిపి నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. రైతులకు గోనె సంచులు సరఫరా చేయాలని, రవాణాకు సకాలంలో లారీలు ఏర్పాటు చేయాలని, తరుగు పేరుతో డబ్బుల వసూళ్లను ఆపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నన్నయ ఓఎస్‌డి టేకి మృతి

ప్రజాశక్తి - రాజానగరం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్మెంట్ ప్రొఫెసర్, ఓఎస్‌డి ఆచార్య ఎస్.టేకి(53) గుండెపోటుతో గురువారం ఆయన స్వగృహంలోనే మృతి చెందారు. ఆచార్య ఎస్.టేకి 1993 భారతీయ విద్యా భవన్ జల్గావ్‌లో, 1995 ఉత్తర మహారాష్ట్ర విశ్వవిద్యాలయం జల్గావ్‌లో లెక్చరర్‌గా వృత్తిని చేపట్టారు. 1998లో భోపాల్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ అసోసియేట్‌గా, 2007లో ఫరీదాబాద్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 2009లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా చరారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా, ఈసీ మెంబర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీన్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ఓఎస్‌డిగా, ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించారు. టేకి మృతికి యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలిపారు.

ఎస్ఎఫ్ఐ సంతాపం

ప్రొఫెసర్ టేకి మరణానికి ఎస్ఎఫ్ఐ నన్నయ యూనివర్సిటీ కమిటీ సంతాపాన్ని తెలిపింది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.అశోక్‌కుమార్, యూనివర్సిటీ నాయకులు జి.ప్రవళ్లిక, ఎస్.సంధ్య, ఎం.గణేష్, కె.విక్రమ్ మాట్లాడారు. టేకి మరణం విశ్వవిద్యాలయానికి తీరని లోటు అన్నారు. గతంలో నిర్వహించిన అనేక ఉద్యమాల్లో విశ్వవిద్యాలయ యాజమాన్యానికి విద్యార్థులకు మధ్య ఆయన వారధిలా ఉండి అనేక సమస్యల పరిష్కారానికి సహకరించారన్నారు. ఆయన మతికి తీవ్ర సంతాపం తెలిపారు.

మానవతావాది ఆచార్య టేకి

ఆచార్య టేకి గొప్ప మానవతావాది అని ఎస్‌కెవిటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎబిఎల్.రాజబాబు అన్నారు. గురువారం ఎస్‌కెవి కళాశాల మూల్యాంకన కేంద్రంలో టేకి మృతికి అధ్యాపకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మరణం యూనివర్శిటీకి తీరని లోటు న్నారు. డాక్టర్ డివి.రమణమూర్తి, డాక్టర్ పివిబి.సంజీవరావు, ఎం.నరసింహ, ఇతర అధ్యాపకులు టేకి మృతికి సంతాపం తెలిపారు.

వైసిపి ప్రచార కమిటీ అధ్యక్షునిగా అప్పాజీ

ప్రజాశక్తి - బిక్కవోలు

వైసిపి ప్రచార కమిటీ అనపర్తి నియోజకవర్గ అధ్యక్షునిగా కొంకుదురుకు చెందిన రొంగ అప్పాజీ నియమితులయ్యారని అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అప్పాజీని ఎంఎల్ఎతో పాటూ పలువురు వైసిపి నాయకులు అభినందించారు. అప్పాజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.

ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్లకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - బిక్కవోలు

కాపవరంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బికెలను ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, ఎంఎల్ఎ జక్కంపూడి రాజాతో కలిసి అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కృష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు మారెళ్ల భీష్ముడు, పంచాయతీ సెక్రటరీ అశోక్‌కుమార్, కాపవరం ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దాతలు సహకరించడం అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

వివిధ వర్గాల ప్రజలకు పేదలకు పలువురు వ్యక్తులు తమ ఆర్గనైజేషన్ ద్వారా సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని చిడిపి సోషల్ సర్వీస్ అధినేత ప్రత్తిపాటి అబెడ్నేగో అన్నారు. చిడిపికి చెందిన దోలిపే వెంకటాయమ్మ మనవరాలు రుచితరత్నప్రియ వాణీ వేడుక సందర్భంగా సోషల్ సర్వీస్ సంస్థ కొవ్వూరు, రాజమహేంద్రవరంలో 150 మందికి బుధవారం భోజనాలను అందించిందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - చాగల్లు

రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి మిల్లలర్లను హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారు గురువారం మండలంలో బ్రాహ్మణగూడెం, దారవరం గ్రామాల్లో రైసుమిల్లులో తనికీ నిర్వమించారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు రుజువు కావడంతో రెండు మిల్లుల యాజమాన్యాలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. బ్రాహ్మణగూడేనికి చెందిన సూర్య దత్త ట్రేడర్స్, దారవరంలోని శ్రీ తేజా ఏజెన్సీస్ రైస్ మిల్లులకు ఈ నోటీసులు ఇచ్చామని తెలిపారు. వారి వెంట డిఎస్ఒ పి.ప్రసాదరావు, ఎఎస్ఒ పి.విజయభాస్కర్, సిఎస్‌డిటిలు జి.బాపిరాజు, వై.సుజాత, పౌరసరఫరాల శాఖ డిఎం వి.నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఈలి వెంకటేశ్వరరావు (47) బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మతి చెందారు. వ్యవసాయ కూలీగా పనిచేసే వెంకటేశ్వరావు పనులు ముగించుకుని ఇంటి వద్ద స్నానానికి పైపు కొడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సర్క్యూట్ అయ్యి అక్కడికక్కడే మతి చెందారు. నిరుపేద అయిన వెంకటేశ్వరరావుకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వంత ఇల్లు కూడా లేని వెంకటేశ్వరరావు మతితో ఆ కుటుంబం రోడ్డు పాలయ్యింది.

ప్రియురాలి చేతిలో యువకుని హత్య

ప్రజాశక్తి- గోకవరం

ప్రియురాలి చేతిలో యువకుడు హత్యకు గురైన సంఘటన గురువారం మండలంలోని తిరుమలాయపాలెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలాయపాలెంకు చెందిన ఉమ్మి నాగ శేషు(25) తాపీ పని చేస్తూ ఉంటాడు. 2016లో రంపచోడవరం మండలం చిలక వీధి గ్రామానికి చెందిన కుర్లు డిబోరాతో పరిచయం ప్రేమగా మారింది. ఆమె వద్ద నుండి నాగ శేషు రూ.రెండు లక్షల నగదు, ఒక బంగారం చైను తీసుకున్నాడు. ఆ డబ్బులు, బంగారం చైను నాగశేషుని అడుగగా ఇవ్వలేదు. దీంతో గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో నాగ శేషు ఇంటికి ఆమె ఆమెతో మరో వ్యక్తితో కలిసి వచ్చింది. వారి వెంట తీసుకువెళ్లిన కత్తిపీట కర్రతో నాగశేషుని బలంగా కొట్టడంతో తల్లి ఒమ్మి గంగ వారిని అడ్డుకుంది. దీంతో వారు ఆమెపై కూడా దాడి చేసి పరారయ్యారు. గాయపడిన నాగశేషును బంధువులు 108 వాహనంలో రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మతి చెందాడు. తల్లి ఒమ్మిగంగ ఫిర్యాదు మేరకు గోకవరం ఎస్ఐ శివ నాగబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన వ్యాపారి మరణం

ప్రజాశక్తి-సామర్లకోట

ఒక హోటల్ వ్యాపారి సెల్ఫీ వీడియో పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సామర్లకోటలో సంచలనం రేపింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ వెల్లడించారు. స్థానిక స్టేషన్ సెంటర్లో టిఫిన్ హోటల్ నడుపుతున్న గోపాలకష్ణ ప్రియురాలు మోసం చేసిందనిసెల్ఫీ వీడియో పెట్టి రెండు రోజులు క్రితం పురుగుల మందు తాగాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మతునికి బార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన తండ్రి మరణానికి కారణమైన తమ హోటల్లో పనిచేస్తున్న మహిళ మరికొందరిపై తక్షణం కరిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని భార్య, కుమార్తెలు కోరారు.

పిడుగుపాటుతో యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక గాంధీ నగర 29వ వార్డుకి చెందిన ప్రకతి శ్రీనివాస్ (22) పిడుగుపాటుకు గురై గురువారం సాయంత్రం మతి చెందాడు. స్థానికులు కుటుంబికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ పూర్తి చేసుకున్న శ్రీనివాస్ తన అన్న వివాహ కార్యక్రమానికి సామర్లకోటకు వచ్చాడు. ఈ నెల మూడో తేదీన అన్న వివాహం పూర్తికాగా తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి పెద్దాపురం మండలం దివిలి గ్రామం వద్ద రాజుపాలెం ఉన్న వాటర్ ఫాల్స్ చూసేందుకు గురువారం మధ్యాహ్నం వెళ్లారు. సాయంత్రం మబ్బులతో గాలులు వీయడంతో వీరు సమీపంలోని ఒక చెట్టు కింద తల దాచుకున్నారు. ఇంతలో వీరికి అతి సమీపంలో పిడుగు పడి శ్రీనివాస్ అక్కడికక్కడే మతి చెందాడు. మతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మతుడు శ్రీనివాస్‌కు తల్లి తండ్రి ఇద్దరు అన్నయ్యలు ఒక చెల్లి ఉన్నారు. శ్రీనివాస్ మతి పట్ల పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సంతాపం తెలిపారు.

క్వారీ గోతిలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మండలంలోని దూబచర్ల గ్రామం వద్ద క్వారీ గోతిలో పడి దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొండల తాతారావు(48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేచర్ల శివారు ఆకుల ప్రకాష్‌కు చెందిన క్వారీలో కొండల తాతారావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండపై ట్రాక్టర్‌ను నడుపుతుండగా ప్రమాద వశాత్తూ ట్రాక్టర్‌తో పాటూ క్వారీ గోతిలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తాతారావు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సతీష్ తెలిపారు.

వాలంటీర్లకు నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాలంటీర్లు బాధ్యతగా, క్రమశిక్షణతో పని చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కొత్తగా నియమితులైన 2 మంది వాలంటీర్లకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎడిసి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హతే ప్రాతిపదికగా లబ్ధిదారులను గుర్తించడంలో కూడా వాలంటీర్లు బాధ్యతాయుతమైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా వాలంటీర్లు బాగా పని చేయాలని ఎడిసి సూచించారు. టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య భద్రతకు సర్వే

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర వహించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ దిశగా కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక దష్టి సారించింది. విధి నిర్వహణలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సి సంరక్షణా చర్యలపై ఆరు ప్రత్యేక బందాలతో సర్వే చేపట్టారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సూచన మేరకు ఈ బందాలు గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు సర్వే నిర్వహించనున్నాయి. కాకినాడ నగరంలో చెత్త సేకరణ, రోడ్లను ఊడ్చడం, డ్రైన్లు శుభ్రం చేయడం, డంపింగ్ యార్డు విధులతో సహా వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సుమారు 1200 మంది రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆరోగ్య స్థితిగతులపై ఈ సర్వే చేయనున్నారు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ముగ్గురు కమ్యూనిటీ మెడిసిన్ పీజీలతో ఒకొక్క టీమ్‌గా మొత్తంగా ఆరు టీములను ఏర్పాటు చేశారు. వీరంతా క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొటున్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలను స్వయంగా గుర్తించి మూడు రోజుల్లో కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాలకు నివేదిక ఇవ్వనున్నారు. కమిషనర్ సందర్శన కాకినాడ సంజయ్‌నగర్ ప్రాంతంలోని శాగ్రిగేషన్ కాంప్లెక్స్‌లో ప్రారంభించిన సర్వే ప్రక్రియను కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల గురువారం పరిశీలించారు. అక్కడి వైద్య బందానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైద్య బందం ఇచ్చే నివేదిక ఆధారంగా పారిశుధ్య కార్మికులకు మెరుగైన వైద్యసేవలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తామన్నారు.

వృద్ధులు ఎండలో తిరగరాదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నందున వద్దులు ఎండలో తిరగరాదని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట ఇందిరా కాలనీలో నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ సమయం ఎండలో ఉండడం వల్ల శరీరంలోని పలు అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. దీన్ని అధిగమించడం కోసం సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదని, నూలు దుస్తులు ధరించాలన్నారు. ఈ వేసవికాలంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే పాదరక్షలు ధరించాలని, గొడుగు కూడా తీసుకువెళ్లాలని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, శిరీష, ఎస్.శ్రీనగేష్, రాజా, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.



రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోగ నిరోధక వ్యవస్థ బలంగా ఉంటే జబ్బులు రావని లేకుంటే శరీరం లోపల రకరకాల అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందని డాక్టర్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైరస్, బ్యాక్టీరియా కారణంగా పలు అనారోగ్యాలు వస్తాయన్నారు. వీటి నివారణ కోసం వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. వ్యాక్సిన్స్‌తో స్మాల్ ఫాక్స్ నిర్మూలించామని, పోలియో కేసులు కూడా దాదాపు నివారించామన్నారు. ధనుర్వాతం కూడా తగ్గుముఖంలో ఉందన్నారు. పెద్దలకు కూడా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్లూ వ్యాక్సిన్‌ను ప్రతి సంవత్సరం వేయించుకోవడం ఉత్తమం అన్నారు. నిమోనియా రాకుండా కూడా వ్యాక్సిన్ వేయించుకోవచ్చు అని ఇవన్నీ కూడా వైద్యుల సూచనలు మేరకు వేయించుకోవాలని డాక్టర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సాంప్రదాయకంగా రైతులు తమ పొలాలు భూములను రబీ మరియు ఖరీఫ్ పంటల మధ్య నీటిపారుదల సౌకర్యాలు లేని కారణంగా బీడుగా వదిలేవారు. అటువంటి పరిస్థితిని అధిగమించడానికి, రైతులు అభివద్ధి చేసిన పిఎండిఎస్ మోడల్‌కు ప్రాధాన్యతనిచ్చారు. మట్టిలో సజీవ వేర్లు ఉండటం, బయోమాస్ ఉత్పత్తి, మట్టికి కార్బన్‌ను జోడించడం, మెరుగైన నీటి నిల్వ సామర్థ్యం, నేల సాంద్రత నేలలోని సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుదల లాంటి కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని ప్రకతి వ్యవసాయ ప్రతినిధి పడాల రాజేష్ వివరించారు. గొల్లలగుంట క్లస్టర్ సిబ్బంది, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జంక్షన్ అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ కొండయ్యపాలెం ఫ్లయ ఓవర్, చీడీలపొర వద్ద నిర్మించిన 80 అడుగుల రహదారిని అనుసంధానం చేసే ప్రాంతంలో జంక్షన్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కాకినాడ నగరంలో పలు అభివద్ధి పనులను పరిశీలించారు. మిలటరీ రోడ్డు ప్రాంతంలో జంక్షన్ అభివద్ధికి సంబంధించి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎస్ఇ పి.సత్యకుమారి కమిషనర్‌కు వివరించారు, డిఇ సుబ్బారావు, డిసిపి హరిదాసు వీరి వెంట ఉన్నారు. అంతకుముందు రేచర్లపేట రైల్వే ట్రాక్‌ను ఆనుకుని మేజర్ డ్రైన్‌లో డీసిల్టేషన్ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. వార్ఫురోడ్డు బిఎస్ఎన్ కార్యాలయం సమీపంలో వర్షపునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పు తరలించేందుకు నిర్మిస్తున్న పంపింగ్‌స్టేషన్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడేలోపు పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఇలు మాధవి, శ్రీనివాస ప్రసాద్, ఎఇలు వై.నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

54 పాఠశాలల్లో నాడు - నేడు పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 54 ప్రభుత్వ పాఠశాలలో నాడు - నేడు రెండో విడత నిధులు రూ.14.95 కోట్లతో అభివద్ధి పనులు జరుగుతున్నాయని ఎంఇఒ సిహెచ్.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 9 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో పాఠశాలల అభివద్ధిలో భాగంగా 9 రకాల అవసరాలకు సంబంధించి అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణ పరిధిలోని రాజీవ్ కాలనీ యూపీ స్కూలు, గోలి చిన్న కొండయ్య యూపీ స్కూల్, రాజీవ్ గాంధీ యూపీ స్కూల్, మండల పరిధిలోని చంద్రమాంపల్లి, కాండ్రకోట, వడ్లమూరు, కట్టమూరు జిల్లా పరిషత్ హైస్కూల్స్, జె.తిమ్మాపురం, ఆర్‌బి.కొత్తూరు, ఉలిమేశ్వరం, వాలుతిమ్మాపురం, మర్లావ ఎలిమెంటరీ స్కూల్స్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు.

యానాం వార్తలు


సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ప్లాస్టిక్ వాడకంపై నిషేధం

ప్రజాశక్తి - యానాం

పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ ప్రత్యేక కార్యాచరణకు కసరత్తు చేస్తున్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిటీ సభ్యులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడటం వల్ల ఏర్పడే అనర్థాలను వారికి వివరించారు. ఉత్పత్తిదారులకు జూన్ 5 వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బట్టల బ్యాగులను వాడాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది, లయన్స్ క్లబ్ పిల్లారాయ యానాం, హెచ్‌ఆర్ స్క్వేర్ సిబ్బంది, వర్తక సంఘాలు, తదితర సంస్థలచే ప్రతి మంగళవారం ర్యాలీలు,అవగాహన సదస్సులు నిర్వహించారు. సుమారు 10వేల గుడ్డ బ్యాగులు సరఫరా చేస్తామన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ వినియోగిస్తే వాటిని స్వాధీన పరుచుకుని జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, డిటిసి గణేషన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కష్ణ సుధాకర్, ఎం.శ్రీనివాస్ కుమార్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతంలోని ప్రతి పెట్రోల్ బంక్ యాజమాన్యం పుదుచ్చేరి ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని ప్రాంతీయ పరిపాలన అధికారి,పౌరసరఫరాల శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోల్ బంకుల్లో రిజిస్టర్ నిర్వహించాలని, పెట్రోల్ డీజిల్ విక్రయానికి సంబంధించి బిల్లు ఇవ్వాలని, 2500 లీటర్ల కంటే ఎక్కువ విక్రయాలు ఉంటే పౌరసరఫరాల శాఖ నుండి అనుమతి పొందాలని అన్నారు. పెట్రోల్ బంక్ 24 గంటలు పని చేయాలని, ద్విచక్ర వాహనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, శుభ్రమైన టాయిలెట్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే పౌర సరఫరాల శాఖ ద్వారా లిఖితపూర్వకంగా సాక్షాదారులతో సమర్పించాలన్నారు. పెట్రోల్ బంక్ ఆవరణలు సిసి టివి నిఘాలో ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు.

స్టెనోగ్రాఫర్‌గా ఇందిర

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం నిర్వహించిన స్టెనోగ్రఫీ గ్రేడ్-2 పరీక్షా ఫలితాల్లో పరంపేటకు చెందిన చేటకాల ఇందిర ఉత్తీర్ణత సాధించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి, అగ్రి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎల్.కుమార్ ప్రకటన విడుదల చేసారు. పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.


ఎంపికైన చేటకాల ఇందిర

హోంమంత్రిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డిఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్ బాబు రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హోం మంత్రి వారి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిఎస్‌పిల బదిలీల్లో కిషోర్ బాబు మార్కాపురం సబ్ డివిజన్ నుంచి బదిలీపై రాజమహేంద్రవరానికి వచ్చారు. ఈ క్రమంలో డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా హోం మంత్రిని కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో బొమ్మూరు సిఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఎస్‌పి కిషోర్‌బాబు

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.సునీత తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడ్డ దగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులందరు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌టిఐ ఇన్‌ఛార్జిగా వెంకటేష్

ప్రజాశక్తి-గోపాలపురం

దొండపూడి గ్రామానికి చెందిన యంగల వెంకటేష్ పోలవరం నియోజకవర్గ ఆర్‌టిఐ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి నియామక పత్రాన్ని ప్రజాసంకల్ప వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు వి.మాలకొండయ్య చేతుల మీదగా అందుకున్నట్లు వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ఆర్‌టిఐ, హ్యూమన్ రైట్స్ సమావేశంలో భాగంగా తనతో పాటు మరి కొంతమందికి పత్రాలను అందజేశారన్నారు. వేదిక వ్యవస్థాపకులు ఎం.రంగసాయిరెడ్డి నేతత్వంలో ప్రముఖుల చేతులు మీదుగా తీసుకున్నానన్నారు. తనను నియోజకవర్గ ఇన్చార్జిగా ఎంపిక చేసినందుకు అందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం గలం విప్పుతూ ప్రజలకు న్యాయసేవ చేస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ అవినీతి లేని పాలనకు కృ షి చేస్తానని వెంకటేష్ విలేకరులకు తెలిపారు.

కుటుంబం మొత్తానికి వైఎస్ఆర్ బీమా వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కొత్తపేట

చంద్రన్న బీమా మాదిరిగానే వైఎస్ఆర్ బీమాను కుటుంబం మొత్తానికి భీమా పథకం వర్తింప చేయాలి టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. గురవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడతూ కుటుంబ సభ్యులను కోల్పోయిన ఎన్నో కుటుంబాలకు, ఆసరా కల్పించిన చంద్రన్న బీమా పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నాడు కుటుంబంలో ఎవరూ చనిపోయినా, చంద్రన్న బీమా పథకం వర్తించగా, నేడు వైయస్ఆర్ బీమా పథకం కుటుంబంలో ఒక్కరికీ మాత్రమే వర్తిస్తోందన్నారు. నాడు చంద్రన్న బీమాలో సహజ మరణానికి రూ.రెండు లక్షలు ఇవ్వగా, నేడు రూ.1 లక్ష మాత్రమే ఇస్తున్నారని అన్నారు. నాడు 15 రోజుల్లో పరిహారం ఇస్తే నేడు ఏడాదికి కూడా పరిహారం అందించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, జిల్లా టిడిపి కార్యదర్శి మాసాబత్తుల ఆనందరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు సిఎం జగన్ చర్యలు

ఎంపీ మార్గాని భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి పభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు అన్ని విధాలా సిఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారని వైసిపి పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. గురువారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గల ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ భరత్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎందుకొచ్చారు.. ఏమి చూశారు. ఎవర్ని పరామర్శించారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ప్రచారం కోసం అయితే తమకేమీ ఇబ్బంది లేదని, అలా కాకుండా అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను, పంటలను చూసేందుకని వచ్చి..ప్రభుత్వాన్ని విమర్శిస్తానంటే మంచిది కాదన్నారు. వేసవి కాలంలో కురిసిన అకాల వర్షాలకు రైతులకు తీరని నష్టం, కష్టం వచ్చిందని, ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటోందన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యమే కాకుండా మొలకెత్తిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ గుర్తించాలన్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వాలు కొనేవి కావన్నారు. కానీ సిఎం జగన్ ప్రతీ ధాన్యం గింజనూ రైతుల నుండి కొనుగోలు చేయమని అధికారులకు ఆదేశాలిచ్చారని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. కోనసీమలో మొలకెత్తిన ధాన్యం 1800 టన్నులను ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఎంపీ భరత్ తెలిపారు. ఇప్పటి వరకూ ఉభయ గోదావరి జిల్లాలలో 86 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. రైతుల పరామర్శ పేరుతో చంద్రబాబు, పవన్ వచ్చి వెళ్ళారు తప్పిస్తే..ఆ పర్యటనల వెనుక మర్మం అందరికీ తెలుసునని ఎంపీ భరత్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించే మహానాడుకు ప్రజలను సమాయత్తం చేసే పనిలో భాగంగా పర్యటనలు తప్ప.. నిజంగా రైతులపై ప్రేమ కాదన్నారు. చంద్రబాబు వచ్చి రైతులకు న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఉంటానన్నారు..ఆ మర్నాడే వెళ్ళిపోయారని, ఇప్పుడు పవన్ కళ్యాణ్ పర్యటన.. ఎవరి కోసమో, దేనికోసమో ఈ పర్యటనలు అర్థం చేసుకోలేని అమాయకులెవరూ లేరని ఎంపీ భరత్ అన్నారు. సమావేశంలో నగర వైసిపి అధ్యక్షుడు అడపా శ్రీహరి, కడియం మండలం అధ్యక్షుడు స్టాలిన్, మింది నాగేంద్ర, పిల్లి నిర్మల, మజ్జి అప్పారావు, పోతుల విజయలక్ష్మి, పితా రామకష తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్


సుబ్బారావును సన్మానిస్తున్న ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ సభ్యులు

న్యాయవాది ముప్పాళ్ల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్)కు ఎపి రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు, ఎపి అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ కన్వీనర్ ముప్పాళ సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని పలువురు అన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ సభ్యులు ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకునా్రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పాళ సుబ్బారావు ఇప్పటివరకు న్యాయవాదిగా పేదలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ గ్రూప్ సభ్యులు అనూప్ జైన్, సామాజిక సంస్కర్త ఎండీ అమీర్ పాషా, బి.కష్ణా చైతన్య, ఆర్‌టిఐ వరదా నాగేశ్వర రావు, ఆకుల విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సీతానగరం

మిర్తిపాడు సబ్ స్టేషన్ నందు వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మెయింటనెన్స్ పనులు చేస్తారని డిఇ నక్కపల్లి శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా కి అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిలంక, ములకల్లంక గ్రామాలకు, మధురపూడి అగికల్చర్ సర్వీస్ లకు విద్యుత్ సరఫరాను నిలుపుదలచేస్తానని తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అసౌకర్యమును గమనించి సహకరించాలని కోరారు.

'చదవటం మాకిష్టం'తో సెలవుల సద్వినియోగం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా "చదవటం మాకిష్టం"(ఉయ్ లవ్ రీడింగ్) కార్యక్రమాన్ని రూపొందించారని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పి.దుర్గా ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల లో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు జిల్లా పరీక్షల నిర్వహణా సంస్థ (డిసిఇబి) అందజేసిన 'సెలవుల్లో సరదాగా..సమ్మర్ కాంప్' స్టడీ మెటీరియల్ ను విద్యార్థులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమం లక్ష్యాన్ని తల్లిదండ్రులకు వివరించామన్నారు. ఉపాధ్యాయులందరూ ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల ద్వారా విద్యార్థులకు చేయవలసిన కత్యాలు పంపిస్తారన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాలతో పాటు. సమీపం లో గల గ్రంథాలయాలకు వెళ్లి దిన పత్రికలు కూడా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కార్యక్రమంల పాల్గొన్న విద్యార్థులు, హెచ్ఎం తదితరులు

విలువిద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాజోలు సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఆర్చరీ కోచ్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నలగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. సోంపల్లి గ్రామంలో గురువారం ఆయనమాట్లాడుతూ సోంపల్లి చిల్డ్రన్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్ లో ఉచితంగా విద్యార్థులకు ఆర్చరీ అసోసియేషన్ వారు సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం 7 నుంచి తొమ్మిది గంటల వరకూ విలు విద్యలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు.

పేరుకుపోతున్న చెత్తతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎటు చూసినా రోడ్లు, కాలువలు వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండపేట - ఏడిద ఆర్ అండ్ బి రోడ్డులో కొబ్బరి బొండాల వ్యర్థాలు తాపేశ్వరం - అర్తమూరు రోడ్డులోని కాలువ చెత్తాచెదారం పేరుకు పోతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వ్యాపారులు వాటి వ్యర్థాలను తీసుకువచ్చి ఏడిద రోడ్డు చెంతనే పడవేస్తున్నారు. ఈ వ్యర్థాలు రోడ్డు మార్జిన్ ను ఆక్రమిస్తూ ఉండడంతో ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలు ఎదురైనప్పుడు వాటిని తప్పించుకునే ప్రయత్నం లో ఈ బొండాలపై జారిపడుతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఏడిద రోడ్డులో పేరుకుపోయిన కొబ్బరి బొండాల వ్యర్థాలు